


కొత్త పంతుళ్లు వస్తున్నారు



ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్న ఆశావహుల కల ఫలించింది. 75 రోజుల క్రితం జరిగిన డీఎస్సీ పరీక్షా ఫలితాలను విద్యాశాఖ సోమవారం వెల్లడించింది. ఉమ్మడి జిల్లాలో 1,268 మంది అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖరారయ్యాయి. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం ఎంపికైన అభ్యర్థుల జాబితాలను డీఈవోలు ప్రకటిస్తారు.

- భువనగిరి టౌన్

» ప్రభుత్వ పాఠశాలల్లో తీరనున్న ఉపాధ్యాయుల కొరత » ఉమ్మడి జిల్లాలో 1,268 మందికి ఉద్యోగాలు
» వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు తాత్కాలిక బ్రేక్ » ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగుపడనున్న విద్యాబోధన

డీఎస్సీ అభ్యర్థులకు ఈ నెల 9న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందించనున్నారు. ఇదిలా ఉండగా, వెల్లడైన ఫలితాల ఆధారంగా ఆశావహులు వారి ర్యాంక్, మార్కులు, నోటిఫికేషన్‌లో ప్రకటించిన పోస్టులు, రిజర్వేషన్‌ను గణిస్తూ ఉద్యోగ అవకాశాలను అంచనా వేసుకునే పనిలో పడ్డారు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందనుంది. అయితే మిగులు పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం ఇటీవల ప్రకటించినట్లుగానే మరో విడత డీఎస్సీని కూడా త్వరగా నిర్వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

1,263 మందికి ఉద్యోగాలు

దీర్ఘకాలం అనంతరం రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 1న నోటిఫికేషన్ జారీ చేసింది. జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 5వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రభుత్వం మాత్రం 1,268 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. వీటికి సుమారు 17 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని పరీక్షలు రాశారు. విద్యాశాఖ వెల్లడించిన ఫలితాల ఆధారంగా నల్లగొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి జిల్లాలో 277 మంది నూతన ఉపాధ్యాయులు రానున్నారు. ఉద్యోగాలు లభించే అదృష్టవంతులెవరో ఒకటి రెండు రోజుల్లో తేటతెల్లం కానుంది.

రిజర్వేషన్ల విధానంపై అభ్యర్థుల ఆరా

విద్యాశాఖ అధికారులు జిల్లాల వారీగా ఫలితాలను వెల్లడించగానే అభ్యర్థులు వారికి వచ్చిన ర్యాంకు, మార్కుల ఆధారంగా రిజర్వేషన్లు పోగా ఉద్యోగం వస్తుందా? రాదా? అనే లెక్కల్లో మునిగారు. ఈ నేపథ్యంలో వర్టికల్, హారిజంటల్‌లో ఏ విధానంలో విద్యాశాఖాధికారులు రిజర్వేషన్ పోస్టులు భర్తీ చేస్తారని అభ్యర్థులు ఆరా తీయడం కన్పించింది. ఒక కేటగిరీలో నాలుగు పోస్టులు ఉంటే అందులో 33శాతం మహిళా రిజర్వేషన్ ప్రకారం ఒక పోస్టును మహిళలకు కేటాయిస్తారు. అయితే ఆ కేటగిరిలో మహిళలకు మిగిలిన ముగ్గురి కంటే అధికంగా మార్కులు వస్తే వారిని మహిళకు కేటాయించిన పోస్టులో భర్తీ చేస్తారా? లేకా అధిక మార్కులు వచ్చినందున మిగిలిన మూడు పోస్టుల్లో ఒకటి కేటాయిస్తారా? అని అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. అయితే రిజర్వేషన్ కేటాయింపుపై విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,210 ప్రభుత్వ పాఠశాలలు

ఉమ్మడి జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో 3,210 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 2,11,009 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. సుమారు 9వేల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. దీంతో పలు పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతతోపాటు ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కరే టీచర్లు మిగిలారు. అయి తే విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య అంద డం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో త్వరలో విధుల్లో చేరనున్న 1,268 మంది ఉపాధ్యాయుల తో పాఠశాలల వారీగా కొన్ని ఇబ్బందులు తొలగనున్నప్పటికీ మిగులు పోస్టులను భర్తీ చేస్తేనే విద్యార్థుల కు న్యాయం జరుగుతుందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. డీఎస్సీ ఫలితాల వెల్లడితో నూతన ఉపాధ్యాయులు త్వరలో విధుల్లో చేరనుండగా, ఇటీవల 2008 డీఎస్సీలో అర్హత సాధించిన వారిని కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా విధుల్లో తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఫలితంగా ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడినట్టుయింది. నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరాకే వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు అధికారులు తుది రూపం ఇవ్వనున్నట్టు సమాచారం. అలాగే విద్యావాలంటీర్ల వ్యవస్థకు ఇక శాశ్వతంగా తెరపడినట్లేనని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఏకోపాధ్యాయ టీచర్లు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులను నియమించాలని, దీంతో అక్కడ మెరుగైన విద్యాబోధన అందడంతోపాటు ఉన్నవారిపై భారం తగ్గుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.



కేటగిరీల వారీగా పోస్టులు ఇలా..

యాదాద్రి జిల్లాలో 719 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 55,204 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వివిధ కేటగిరీలకు చెందిన 3,497 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా, 2,761 మంది విధులు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 736 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజాగా, 277 పోస్టులు భర్తీ కానుండడంతో మిగతా 459 పోస్టులు ఖాళీగా ఉండనున్నాయి. కాగా, నూతనంగా భర్తీ చేయనున్న 277 పోస్టుల్లో 163 ఎస్జీటీ, 114 స్కూల్ అసిస్టెంట్, రెండు పీఈటీ, ఒక పీడీ పోస్టు ఉంది. వీటిలో 262 పోస్టులో లోక్ బాడీ స్కూళ్లలో, 15 పోస్టులు ప్రభుత్వ యాజమాన్యం పరిధిలోని పాఠశాలల్లో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 605 పోస్టులు ఈ డీఎస్సీలో భర్తీ కానున్నాయి. అందులో 430 ఎస్జీటీ పోస్టులు, 141 స్కూల్ అసిస్టెంట్, 26 లాంగ్వేజ్ పండిట్ పోస్టులు, ఆరు పీఈటీ పోస్టులు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో మొత్తం 386 పోస్టుల భర్తీ చేయనున్నారు. అందులో 261 ఎస్జీటీ పోస్టులు, 97 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 23 లాంగ్వేజ్ పండిట్ పోస్టులు, ఐదు పీఈటీ పోస్టులు తాజాగా భర్తీ చేయనున్నారు.

అన్విత.. మరో ఘనత



● భారత సైన్యంతో కలిసి 6,488 మీటర్ల గౌరిచెన్ పర్వతం అధిరోహణ

భువనగిరికి చెందిన పర్వతారోహకురాలు పడమటి అన్విత మరో ఘనత సాధించింది. అరుణాచ ల్ ప్రదేశ్ రాష్ట్రం తవాంగ్ జిల్లాలోని 6,488 మీటర్ల 'గౌరిచెన్' పర్వతాన్ని 38 మంది బృందం సభ్యులతో కలిసి సెప్టెంబరు 22న అధిరోహించింది. గౌరిచెన్ పర్వతా న్ని అధిరోహించిన తొలి బృందం సభ్యురాలిగా అన్విత మరో రికార్డును సొంతం చేసుకుంది. తూర్పు హి మాలయాల్లో హిమనీనదంతో నిండిన పర్వత సమూహం గౌరిచెన్ పర్వతం వెనుకాల చైనా సరిహద్దు ప్రారంభం అవుతుంది. కష్టతరమైన భూభాగాలకు పేరుగాంచిన గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించేందుకు 1985లో తొలి బృందం ప్రయత్నం చేసి అర్ధంతరంగానే వెనుతిరిగింది. తిరిగి అరుణాచల్ ప్రదేశ్ డిరాంగ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 30మంది భారత సైన్యం, భువనగిరి కేంద్రంగా ఉన్న ట్రానెండ్ అడ్వెంచర్ రాక్ క్లైంబింగ్ అకాడమీకి చెందిన ఎనిమిది మంది సభ్యులు సెప్టెంబరు 1న గౌరిచెన్ పర్వత అధిరోహణను ప్రారంభించి మైనస్ 15 డిగ్రీల శీతల వాతావరణంలో 19వ తేదీన పూర్తి చేసింది. మేరా థాంగ్, న్యూమెల్లింగ్ ప్రాంతాల మీదుగా గౌహతిలో ఉన్న బేస్ క్యాంపునకు సెప్టెంబరు 25వ తేదీన చేరుకున్నారు. ఈ బృందంలో ఇద్దరు మాత్రమే మహిళలు ఉండగా అన్వితతో పాటు, యశ్వంత్‌నాయక్ (మహబూబాబాద్), అశ్రుష్ కొత్తకాపు (హైదరాబాద్), శరద్ కుల్‌కర్ణి (పూణే), యోగేశ్వరి బోహరే (ఔరంగాబాద్), డెనిష్ పటేల్(గుజరాత్), యోగి రాడాలియా (గుజరాత్), జయేష్ చోక్సీ (ముంబై) ఉన్నారు.అన్విత గతంలోనే ప్రపంచంలోని అత్యంత ఎత్తైన 7 పర్వతాల్లో ఎవరెస్ట్, కిలిమంజారో, ఎల్బ్రూస్, విన్‌సెన్ పర్వతాలను అధిరోహించగా మిగతా కోజియోస్కో, డెనాలి, అకాంకాగోవా పర్వతాలను అధిరోహించే లక్ష్యంతో ఉన్నది. గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించి ఇటీవలే భువనగిరికి వచ్చిన ఆమెను పలువురు అభినందించారు.

● భువనగిరి టౌన్


గౌరిచెన్ పర్వతంపై బృందం



ఉమ్మడి జిల్లాలోని సహకార బ్యాంకుల్లో ఈ నెల మొదటి వారం నుంచే నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) పథకాన్ని అమలు చేసేందుకు డీసీసీబీ పాలకవర్గం నిర్ణయించింది. - నల్లగొండ

ఎన్ఎల్ఎం పథకం రూ.1కోటి సహకారం

గొర్రెలు, నాటుకోళ్ల పెంపకానికి డీసీసీబీ సబ్సిడీపై రుణం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ పథకాన్ని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని 36 డీసీసీబీ బ్రాంచ్‌ల పరిధిలో అమలు చేయనున్నారు. ఈ పథకం కింద గొర్రెలు, నాటు కోళ్లు, పందుల పెంపకం కోసం రూ.1కోటి వరకు రూ.50లక్షల సబ్సిడీతో రుణాలు అందించనున్నారు. పరిమితి లేకుండా ఈ పథకాన్ని ఎంత మందికైనా వర్తింపజేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ప్రధానంగా రైతులకు మేలు చేసేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. రూ.1కోటి వరకు రుణ మంజూరులో రూ.50 లక్షల వరకు సబ్సిడీ ఉండటంతో లబ్ధిదారులకు ఈ పథకం ఉపయోగపడనుంది. ఈ పథకాన్ని వీలైనంత మేరకు లబ్ధిదారులకు చేరువ చేయాలని పాలకవర్గం యోచిస్తోంది.

35శాతం రాయితీతో పండ్ల తోటలకు ప్రోత్సాహం

నేషనల్ అగ్రికల్చర్ బోర్డు పథకం కింద పండ్ల తోటలకు డీసీసీబీ ద్వారా రుణాలు ఇవ్వనున్నారు. 35శాతం రాయితీతో ఈ పండ్ల తోటలను విస్తరింపజేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. బత్తాయి, నిమ్మతో పాటు ఇతర తోటల పెంపకం కోసం రూ.30లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నారు. ఆరు ఎకరాల వరకు భూమిలో తోటలు సాగుచేసుకునేలా రుణాలు మంజూరు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణం తగ్గిపోతుండటాన్ని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం నేషనల్ అగ్రికల్చర్ బోర్డు ద్వారా పండ్ల తోటలను విస్తరింపజేయాలని తలపెట్టింది. అందుకు త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వల కోసం గోదాములు నిర్మాణానికి రూ.2కోట్ల వరకు సొసైటీలకు మంజూరు చేయనున్నారు. వరల్డ్ లార్జెస్ట్ గ్రేన్ స్టోరేజీ పథకంలో భాగంగా ఈ గోదాముల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టి వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేగాక సహకార బ్యాంకులను బలోపేతం చేసేందుకు కొత్తగా ఆరు బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు డీసీసీబీ సన్నద్ధమైంది. ఇప్పటికే 36 బ్రాంచ్‌లు ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్నాయి. కొత్తగా నారాయణపురం, దామచర్ల, గరిడెపల్లి, ఆత్మకూర్(ఎం), తిప్పర్తితో పాటు మరో ప్రాంతంలో నూతన బ్రాంచ్‌లు రానున్నాయి. అదేవిధంగా ఏటీఎంల అవసరాన్ని కూడా డీసీసీబీ పాలకవర్గం గుర్తించి అన్ని బ్యాంకుల పరిధిలో ఏటీఎంలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. రూ.3వేల కోట్ల టర్నోవర్ కోసం కసరత్తు చేస్తున్న అధికారులు, పాలకవర్గం రూ.2,250కోట్ల అనంతరం మూడు నెలల కాలంలో అదనంగా రూ.200కోట్ల టర్నోవర్ సాధించింది. రుణమాఫీ ప్రక్రియకు సంబంధించి రూ.280కోట్లను సంపూర్ణంగా అందజేయడంతో పాటు మరో రూ.50కోట్లు ఇవ్వనుంది.

కొత్త పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కొత్త పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఎన్ఎల్ఎం పథకంతో పాటు నేషనల్ అగ్రికల్చర్ బోర్డు కింద తోటల పెంపకానికి రుణాలు ఇవ్వనున్నాం. లార్జ్ గ్రేన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో గోదాముల నిర్మాణం చేపడతాం. పెద్ద మొత్తంలో బంగారంపై రుణాలు ఇచ్చేందుకు నిర్ణయించాం. డిజిటర్ల ప్రయోజనం కోసం ధన సమృద్ధి డిపాజిట్, ధన వర్ష డిపాజిట్ పథకాలను అమలు చేస్తున్నాం. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలు చేస్తూ బ్యాంకుల అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తోంది.

- కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్

తరచూ కూలుతున్న ఏఎమ్మార్పీ సిస్టర్న్ గోడ

● వివరాలు 7లో..

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీశైలం

మర్రిగూడ, సెప్టెంబరు 30: డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మర్రిగూడ మండల పరిధిలోని శివన్నగూడెం గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసి, ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. మైల సత్తయ్య అధ్యక్షతన నిర్వహి ంచిన సమావేశంలో మండల కార్యదర్శి ఏర్పుల యాద య్య, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు, గడగోటి వెంకటేష్, రుద్రాక్షి శ్రీరాములు, పిట్టల రమేష్, చొప్పరి హనుమంత్, గిరి విష్ణు, సురిగి యాదయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండ శ్రీశైలం

పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

శాలిగౌరారం: పోరాటాలతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. శాలిగౌరారం మండలం బండమీదిగూడెం గ్రామంలో నిర్వహించిన సమా వేశంలో ఆమె మాట్లాడారు. పేదల జీవితాల్లో మార్పు రావాలని, వారికి దేశ సంపదలో సమాన వాటా దక్కాలంటే పోరాటాలే మార్గమని అన్నారు. అనంతరం బండమీదిగూడెం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా అన్నెబోయిన కిరణ్, సహాయ కార్యదర్శిగా బుర్రె సత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మక్క బుచ్చి రాములు, కల్లూరి లింగయ్య, సైదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను ఆదుకోవాలి

నకిరేకల్: జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల బారి నుంచి ప్రజలను ప్రభుత్వం కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. మండలంలోని తాటికల్ గ్రామంలో సోమవారం జరిగిన సీపీఎం శాఖ మహాసభలో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజలు తీవ్ర అనారోగ్యంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించి గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రం చేయించి చెట్లు తొలగించాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, గ్రామశాఖ కార్యదర్శి యాదయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి

నల్లగొండరూరల్: ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని 42,43లో వార్డులో సోమవారం జరిగిన సీపీఎం పట్టణ శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మా ట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటిగా అమలు అమలు జరపడంలో ఆలస్యం చేస్తున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో రెండు నెలలుగా తీవ్రమైన తాగునీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్న మున్సిపల్ సిబ్బంది పట్టించు కోవడం లేదన్నారు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల బారినపడి ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని విష జ్వరాలపై సర్వే చేసి అవసరమైన వైద్యం ప్రజలకు అందించాలన్నారు. అంతకు ముందు దివంగత నేత సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి సీతారాం, పెన్నా అనంతరామశర్మ, వైఆర్‌కే రెడ్డి చిత్ర ్పటాలకు నివాళులర్పించారు. రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనంతుల శంకరయ్య, మధుసూదన్‌రెడ్డి, సునీత, పాల్గొన్నారు.

కాంగ్రెస్ డిజిటల్ సభ్యత్వాలకు ఆదరణ

నకిరేకల్, సెప్టెంబరు 30: ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ డిజిటల్ సభ్యత్వాల నమోదుకు మహిళల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కౌన్సిలర్ గాజుల సుకన్యా శ్రీనివాస్ అన్నారు. నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని 6, 8, 10, 17 వార్డుల్లో సోమవారం విస్తృతంగా పర్యటించి ఆమె సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు తగిన ప్రాధాన్యం లభించిందన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ రాఘవరెడ్డి, కౌన్సిలర్లు మట్టిపల్లి కవితా వీరేందర్, చౌగోని అఖిల లక్ష్మణ్, పన్నాల పావనీశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకన్న, మార్షల్, సబిత, తిరుపతయ్య పాల్గొన్నారు.


డిజిటల్ సభ్యత్వాలు నమోదు చేస్తున్న గాజుల సుకన్య

దేవాదాయశాఖను రద్దు చేయాలి

వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రావు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 30: దేవాదాయశాఖను రద్దు చేసి ఆలయాలను హిందూ ధార్మిక సంస్థల పరిధిలోకి తీసుకొచ్చి వాటి ఆస్తులను, పవిత్రతను కాపాడాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రావు డిమాండ్ చేశారు. తిరుపతి వేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాద విషయంలో జరిగిన అపచారానికి వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపినందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని కాపాడాల్సిన దేవస్థాన పాలకవర్గంలో అన్యమతస్థుల కారణంగా ఆలయ పవిత్రత దెబ్బతింటోందన్నారు. ఆలయాల్లో హైందవేతర ఉద్యోగులను తొలగించాలన్నారు. అనంతరం కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంజి సుధాకర్, నాయకులు జుకూరి సంపత్‌వర్మ, కన్నెబోయిన వెంకట్, నరసింహ, కృష్ణయ్య, వంశి, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విహెచ్‌పి నాయకులు

మౌలిక వసతుల బాధ్యత అధికారులదే

కలెక్టర్ నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండటౌన్, సెప్టెంబరు 30: గ్రామాల్లో ప్రజలకు రక్షిత నీరు అందించడం, పారిశుధ్యం, ప్రభుత్వ సంస్థల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని, వచ్చేవారం పారిశుధ్యంతోపాటు మొక్కలపై ఆడిట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆశా వర్కర్లు గ్రామాల్లో ఎప్పటికప్పుడు జ్వర సర్వే నిర్వహించి బాధితులకు మందులు అందజేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలన్నారు. ఎవరైనా విధులకు సరిగా హాజరుకాకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో న్యాయబద్ధంగా ఉన్న వాటిని అప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. కాగా ప్రజావాణిలో మొత్తం 74 ఫిర్యాదులు అందా యి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎఫ్‌వో రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భాషా పరిజ్ఞానం పెంపొందించాలి

చిట్యాల, సెప్టెంబరు 30 : విద్యార్థుల్లో భాష, గణిత పరిజ్ఞానం పెంపొందించాలని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డిస్ట్రిక్ కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు(డీసీఈబీ) సెక్రటరీ కొమ్ము శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3,5,8,10 తరగతులలోని విద్యార్థులకు భాష, గణితం సామర్థ్యంపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు రామచంద్రనాయక్, సైదానాయక్, హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, అంబటి సత్తయ్య పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోదాడ రూరల్, అడ్డగూడూరు, సెప్టెంబరు 30: సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఆరు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్‌చేశారు. కోదాడ మండలం మంగలితండా, చిమిర్యాల నుంచి కోదాడకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. పాలేరు వాగు నుంచి సోమవారం ఉదయం ఇసుక నింపుకుని కోదాడకు వస్తుండగా, చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద ట్రాక్టర్లను అడ్డుకుని సీజ్ చేశారు. అడ్డగూడూరు మండలం ఆజీంపేట గ్రామ శివారులోని మూసీ నది నుంచి ఆజీంపేటకు చెందిన కన్నెబోయిన వెంకటేష్ ఇసుక అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.158	230	260
సూర్యాపేట	రూ.145	210	240
నల్లగొండ	రూ.150	200	250

చికెన్ ధరలు

శాశ్వత పరిష్కారం లభించేనా?

● తరుచూ కూలుతున్న ఏఎమ్మార్పీ సిస్టర్న్ గోడ ● నాలుగు మోటర్లు నడిస్తే భయపడుతున్న అధికారులు ● తాజాగా మరోసారి ఘటన ● పరిశీలించిన ఉన్నతాధికారులు


ఏఎమ్మార్పీ సిస్టర్న్(రక్షణగోడ),


సిస్టర్న్ గోడ కుంగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ, సీఈ, ఉన్నతాధికారులు (ఫైల్)

దేవరకొండ, సెప్టెంబరు 30: నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల స్వప్నం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) పుట్టంగండి జలాశయం(సిస్టర్న్) నాణ్యతలోపాలు వెంటాడుతూనే ఉన్నాయి. నాలుగు మోటర్లు నడిస్తే నీటిని విడుదల చేయాలంటే సిస్టర్న్‌పై అప్రమత్తంగా ఉండాల్సి పరిస్థితి. 2019లో కట్టపై 1.8కిలో మీటర్ వద్ద ఉన్న ప్రదేశం కుంగడంతో అప్రమత్తమైన అధికారులు మరమ్మతులు చేపట్టారు. సిస్టర్న్ తరుచూ మరమ్మతులకు గురికావడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు ప్రారంభం 2001లోనే మొదటి మోటర్ ప్రారంభించినప్పుడు నాణ్యతాలోపం కన్పించడంతో అధికారులు అప్రమత్తమై చర్యలు చేపట్టారు. గత నెల 27వ తేదీన నాలుగు మోటర్లు నడుస్తుండడంతో సిస్టర్న్ పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రాంతం గోడకింద మట్టి కుంగింది. మట్టి కుంగడంతో ప్యారపిట్‌వాల్ కొంతభాగం కూలింది. దీంతో అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు కూలిన గోడ, రాళ్లను తొలగించి మట్టితో బస్తాలను నింపి కట్టపై భారంపడకుండా మరమ్మతులు చేశారు. ప్రస్తుతానికి నాలుగు మోటర్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. పుట్టంగండి సిస్టర్న్ ప్యారపిట్ వాల్ కూలిన ప్రాంతాన్ని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ నాగేందర్‌రావు, సీఈ అజయ్‌కుమార్‌ల బృందం గత నెల 29వ తేదీన పరిశీలించింది. శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు నివేదికను తయారు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

శాశ్వత మరమ్మతులు చేపడితేనే సమస్య పరిష్కారం

ఏఎమ్మార్పీ సిస్టర్న్ పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.500కోట్లు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు, స్థానికులు కోరుతున్నారు. దీంతో పాటు ప్రధాన కాల్వ చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. కొన్ని డిస్ట్రిబ్యూటరీలు, కాల్వలు కోతకు గురై ఆనవాళ్లు కోల్పోతున్నాయి. సిస్టర్న్ పూర్తిస్థాయిలో మరమ్మతులు, ప్రధాన కాల్వలతోపాటు డిస్ట్రిబ్యూటరీల చుట్టు కంపచెట్లు తొలగించి, మరమ్మతులు చేపట్టి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నెరవేరని ప్రాజెక్టు లక్ష్యం

జిల్లాలోని 2.20లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతో పాటు 516 గ్రామాలకు తాగునీరు అందించడమే ప్రాజెక్టు లక్ష్యంగా 2001లో ఏఎమ్మార్పీ ప్రాజెక్టును ప్రారంభించారు. నాలుగు మోటర్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతోపాటు జిల్లాలోని 90చెరువులు నింపడం, హైదరాబాద్ జంటనగరాలతోపాటు జిల్లాకు తాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్ధేశించారు. జిల్లాలోని దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో ప్రాజెక్టు విస్తరించి ఉంది. ప్రధాన కాల్వ నిర్వాహణ సక్రమంగా లేకపోవడం, ఇరువైపులా 136 కిలోమీటర్లు కంపచెట్లతో నిండిపోయింది. తాగునీటికే తప్ప రెండు పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేని పరిస్థితి. కొన్నేళ్లుగా నాగార్జునసాగర్‌లో నీరులేకపోవడంతో అరకొరగా ఆరుతడి పంటలు వారబంధి పద్ధతిలో సాగునీరు విడుదల చేసేవారు. కాని ఈ సంవత్సరం నాగార్జునసాగర్‌లో పూర్తిస్థాయిలో నిండడంతో ఏఎమ్మార్పీకి నాలుగు మోటర్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి జిల్లాలోని 90చెరువులు నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కాని సిస్టర్న్ తరుచూ మరమ్మతులకు గురవుతుండడంతో మోటర్లను అప్పుడప్పుడు నిలిపివేస్తున్నారు. నాలుగు మోటర్లు నడిస్తే సిస్టర్న్ మరమ్మతులకు గురవుతుండడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలి



ఏఎమ్మార్పీ సిస్టర్న్‌తోపాటు కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించాలి. మరమ్మతులు వేగవంతంగా పూర్తిచేసి ఆయకట్టు పరిధిలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలి. ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలి.

● కంభాలపల్లి ఆనంద్, రైతుసంఘం నాయకుడు, పీఏపల్లి.

మరమ్మతులకు ఆదేశించారు

ఏఎమ్మార్పీ పుట్టంగండి సిస్టర్న్‌గోడ కుంగిన ప్రదేశాన్ని నీటిపారుదలశాఖ ఉన్నత అధికారులు పరిశీలించారు. అక్కడ మరమ్మతులు జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పూర్తిస్థాయిలో శాశ్వతంగా మరమ్మతులు చేపట్టి సాగు, తాగునీరు అందిస్తాం.

● నాగయ్య, ఏఎమ్మార్పీ డివిజన్-4 డీఈ.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	588.90 అడుగులు
టీఎంసీలు	308.7614
ఎడమకాల్వకు నీటి విడుదల	6,790
కుడికాల్వకు	10,200
విద్యుత్ కేంద్రం ద్వారా	29,070
సాగర్‌కు నీటి రాక	36,163
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	49,061 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.05 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	31,291
నీటి విడుదల	36,887

- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644 అడుగులు
టీఎంసీలు	4.15
ఇన్‌ఫ్లో	11,75.55 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	483.09 క్యూసెక్కులు

- కేతేపల్లి

క్రీడలతో విద్యార్థుల్లో స్నేహభావం

కట్టంగూరు, సెప్టెంబరు 30: క్రీడలతో విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం హైస్కూల్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ పురుషుల, మహిళల హ్యాండ్ బాల్ పోటీలను సోమవారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 150మంది క్రీడాకారులు పాల్గొనగా జిల్లాస్థాయికి పురుషుల, మహిళల జట్టును ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9వ తేదీ నుంచి అక్టోబరు 11వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే 53వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యాయులు రాంమోహన్‌రెడ్డి, శ్రీనివాస్, నరహరి, నగేష్, సంపత్ కుమార్, లింగయ్య, మంగ, కవిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు సాగర్ విద్యార్థులు



నాగార్జునసాగర్: రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు నాగార్జున సాగర్ బీసీ గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 29వ తేదీ ఆదివారం నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో వివిధ కేటగిరిల్లో ఎం. గణేష్, ఆర్ అరవింద్, ఏ. సంపత్, బి. శివ, అండర్-18 విభాగంలో ఎం. చందు, ఎం. భరత్, జే. సాయి, జీ. శివ, జీ. స్టీఫెన్, అండర్-20 విభాగంలో ఎం. రాఘవేంద్ర, జి. ప్రేమ్‌కుమార్, కే గణేష్, ఆర్. సాయితేజ్, ఎం. రవీందర్, కార్తీక్ ఎంపికైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడోలో పుట్ట ప్రతీక్‌గౌడ్‌కు రజత పతకం



శాలిగౌరారం: జూడో రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం నూలగడ్డ కొత్తపల్లి గ్రామానికి చెందిన పుట్ట ప్రతీక్‌గౌడ్ రజత పతకం సాధించాడు. వరంగల్‌లో సెప్టెంబరు 24, 25, 26వ తేదీల్లో రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరిగాయి. ప్రతీక్‌గౌడ్ హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం సాధించిన ప్రతీక్ గౌడ్‌ను పలువురు అభినందించారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

● గుర్తుతెలియని వాహనం ఢీకొని ముగ్గురు స్నేహితుల మృత్యువాత

చిలుకూరు, సెప్టెంబరు 30: సూర్యాపేట జిల్లా చిలుకూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మిత్రులు అక్కడికక్కడే మృతిచెందారు. సోమవారం రాత్రి కోదాడ-హుజూర్‌నగర్ రహదారిపై మిట్స్ కళాశాల సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ రాంబాబు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన వల్లపుదాసు వంశీ (22), మాడ్గులపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (21), ఆగామోత్కూరుకు చెందిన మరికంటి దినేష్(22)లు మోటారు సైకిల్‌పై కోదాడ బయలుదేరారు. వేములపల్లి వైపు వస్తుండగా మిట్స్ కళాశాల, ముక్త్యాల మేజర్ మధ్యలో వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.


సంఘటనా స్థలంలో మృతదేహాలు, శ్రీకాంత్, దినేష్(ఫైల్)



45 రోజుల క్రితం తండ్రి మృతి.. ఇంతలోనే విషాదం

ఆగామోత్కూరుకు చెందిన మరికంటి దినేష్ గ్రామంలో బేకరీ నిర్వహిస్తున్నాడు. తండ్రి 45 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, తల్లి పార్వతమ్మతో కలిసి దుకాణాన్ని చూసుకుంటున్నాడు. చెల్లెలు శివానికి వివాహమైంది. కుటుంబానికి అండగా ఉన్న దినేష్ మృతితో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. కోదాడలో కారు కొనుగోలు చేసేందుకు స్నేహితులతో కలిసి బైక్‌పై వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది.

బైక్‌పై ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తుండగా..

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 30: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండమల్కాపురం జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ సింగు(39), బాసుల బగుడి(21), మనీష్ కుమార్‌వర్మ దండుమల్కాపురంలో క్రషర్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. రాజు కిషోర్‌సింగ్‌కు జ్వరం రావడంతో బైక్‌పై చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. దండు మల్కాపురం సమీపంలో బొలెరో వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దీంతో రాజ్ కుమార్‌సింగ్, బస్సుల బగడ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ మనీష్‌కుమార్‌ను హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● చౌటుప్పల్ మండలంలోని మందోళ్లగూడెం శివారులో ట్రాక్టర్‌పై నుంచి పడి ఒకరు మృతిచెందారు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా బాలాజీపేట మండలం గంగడ గ్రామానికి చెందిన గుడ్ల గణేష్(40) మందోళ్లగూడెం శివారులో ఓ పౌల్ట్రీ పరిశ్రమలో భార్యాభర్తలు కలిసి పని చేస్తున్నారు. ఆదివారం సరుకులు కొనుగోలు చేయడానికి ట్రాక్టర్‌పై వచ్చాడు. తిరిగి సాయంత్రం వెళుతుండగా అభినందన్‌రెడ్డి ట్రాక్టర్ నడుపుతుండగా గణేష్ ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారి కింద పడిపోయాడు. ట్రాలీ టైర్లు పై నుంచి వెళ్లడంతో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 30: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, కొనసాగుతున్న పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమ శాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మరిని మేల్కొల్పిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్ర రీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖ మండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివ పార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. లక్ష్మీనృసింహుడిని 7వేల మంది భక్తులు దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 8,37,062 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.


శివాలయంలో స్ఫటిక లింగానికి హారతి ఇస్తున్న అర్చకుడు

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4.30వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 12.00నుంచి ఒంటి గంట వరకు,
మధ్యాహ్నం 1-4 వరకు సర్వ దర్శనాలు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.0గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
రాత్రి నివేదన: రాత్రి 9:30 గంటల నుంచి 9:45 వరకు
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 7 నుంచి 9 గంటల వరకు
తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

చెర్వుగట్టు ఆలయ వేళలు

ఉదయం: 5.00 గంటలకు తెరుస్తారు
సుప్రభాతసేవ మరియు నాదస్వరం: ఉదయం 5.00 నుంచి 5.30 వరకు
నిజాభిషేకం: ఉదయం 5.30నుంచి 6.30గంటల వరకు
దర్శనాలు: ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు
నివేదన: మధ్యాహ్నం 12.00 గంటలకు మహానివేదన
దర్శనం: 12.10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
మూసివేత: మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేత
సాయంత్రం: 3గంటలకు తెరుచుకోనున్న ఆలయం
దర్శనాలు: సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దర్శనాలు
ద్వార బంధనం: సాయంత్రం 7.30 గంటలకు ప్రదోశకాల పూజలు మహా ఫల నివేదన, హారతి అనంతరం ద్వార బంధనం

● నార్కట్‌పల్లి

నిలకడగా 'మూసీ' నీటిమట్టం

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల పరిధితో పాటు ఎగువ మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వారం రోజులుగా ప్రాజెక్టుకు కొనసాగిన ఇన్‌ఫ్లో సోమవారం మరింత తగ్గుముఖం పట్టింది. దీంతో మూడు రోజులుగా ప్రాజెక్టు రెండు క్రస్టుగేట్లు ఎత్తి వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్న అధికారులు సోమవారం ఒక గేటును పూర్తిగా మూసివేసి ఒక్క గేటును మాత్రమే అర అడుగు ఎత్తి కొద్దిపాటి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో ఎగువ ప్రాంతాల నుంచి 1175.55క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఒక క్రస్టు గేటును అర అడుగు ఎత్తడం ద్వారా 483.09క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 630.62క్యూసెక్కులు మొత్తం 1175.55క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీ) నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 644అడుగులుగా(4.15టీఎంసీ) ఉంది.

గ్యాస్ సబ్సిడీ జమ కాలే



ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలవుతున్న మహాలక్ష్మి పథకంలో వంట గ్యాస్ లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులు మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని పేర్కొంటూ పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేరుతో మహిళలకు లేఖలు అందుతున్నాయి. ప్రభుత్వం నుంచి లేఖలు అందుతున్నా తమకు సబ్సిడీ బ్యాంకు లో జమ కాలేదని పలువురు లబ్ధిదారుల చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నుంచి సబ్సిడీ రావడం లేదంటున్నారు.

- మోత్కూరు

» వంట గ్యాస్ లబ్ధిదారులకు ప్రభుత్వం లేఖలు
» సబ్సిడీ డబ్బులు జమ అవుతాయని లేఖలో సారాంశం
» డబ్బులు జమ కాలేదని పేర్కొంటున్న లబ్ధిదారులు

గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.872. లబ్ధిదారుడు పూర్తి డబ్బులు చెల్లించి సిలిండర్ తీసుకోవాలి. అందులోంచి రూ.46.90 పైసలు కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. రూ.500 వినియోగదారుడు భరిస్తే మిగితా రూ.325.10పైసలు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుని ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఉజ్వల కనెక్షన్లు ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం రూ.300 సబ్సిడీ ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.72సబ్సిడీ ఇస్తుంది. లబ్ధిదారులు తీసుకున్న సిలిండర్లపై కొద్ది మందికి మాత్రమే సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. మిగతా వారికి జమ కావడంలేదని చెబుతున్నారు. సబ్సిడీ జమ కాని వారు తమ వివరాల నమోదులో ఏమైనా లోపాలు ఉన్నాయేమోనన్న బెంగతో గ్యాస్ కార్యాలయం, మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సబ్సిడీలో జాప్యం జరిగితే 1967 లేదా 180042500 333 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని లేఖలో పేర్కొన్నారు. ఆ కుటుంబం ఎన్ని సిలిండర్లు తీసుకోవచ్చు, అందులో ఇప్పటికి ఎన్ని తీసుకున్నారన్నది పేర్కొన్నారు. రేషన్ డీలర్లకు లేఖలు అంది 15రోజులవుతున్నా కొన్నిచోట్ల పంపిణీ చేయగా, మరి కొన్ని చోట్ల పంపిణీ చేయలేద ని తెలుస్తోంది. అక్టోబరు నెలలో బియ్యం పంపిణీ చే సేప్పుడు ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

జిల్లాలో 1.16 మంది లబ్ధిదారులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో వాణిజ్య కనెక్షన్లు 2,298 ఉండగా, 1,44,175 గృహ వినియోగదారులు, 48,950 దీపం, 12,897 ఉజ్వల, 23,566 సీఎస్ఆర్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 2,29,588 గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. మహాలక్ష్మి పథకం కింద 1.16లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. మహాలక్ష్మి పథకంలోని లబ్ధిదారులకు మూడేళ్ల ఆ కుటుంబం వినియోగించిన సగటు సిలిండర్ల ఆధారంగా ఏడాదికి ఎన్ని సిలిండర్లు రూ.500లకు ఇస్తారన్నది నిర్ణయించారు.



రూ.500లకు వంటగ్యాస్ సిలిండర్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయడానికి లబ్ధిదారుడు రూ.500లు చెల్లించేలా, ప్రభుత్వం మిగితా డబ్బు(సబ్సిడీ రూపేణ) చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకోవడానికి గ్యాస్ కంపెనీలను, ఏజెన్సీలను ప్రభుత్వం సంప్రదించగా, అందుకు కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలు అంగీకరించలేదు. దీంతో లబ్ధిదారుడు పూర్తి డబ్బు చెల్లించి సిలిండర్ తీసుకుంటే రూ.500 పోను మిగితా డబ్బు తాము లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో సబ్సిడీ కింద జమ చేస్తామని ప్రభుత్వం గత ఏప్రిల్ నుంచి మహాలక్ష్మి పథకం అమలు చేస్తోంది.

సిలిండర్ తీసుకున్నా సబ్సిడీ రాలేదు



రాష్ట్ర ప్రభుత్వం గత ఏప్రిల్ నుంచి మహాలక్ష్మి పథకంలో రూ.500లకే సిలిండర్ పథకం అమలు చేస్తున్నది. నేను గత జూన్‌లో పూర్తి డబ్బు రూ.780 చెల్లించి సిలిండర్ తీసుకున్నాను. ఇంత వరకు నాకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ రాలేదు. ఇటీవల ప్రభుత్వ లేఖ అందింది. అందులో నాకు ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే తీసుకోవడానికి అర్హత ఉందని, ఇప్పటి వరకు నేను సిలిండర్ తీసుకోలేదని లేఖలో పేర్కొన్నారు.

- యానాల సంధ్యారాణి, గృహిణి, ముశిపట్ల

గ్యాస్ డీలర్లే రూ.500లకే సిలిండర్ ఇచ్చేలా ఉండాలి



రాష్ట్రం రూ.500లకే సిలిండర్ పథకం అమల్లోకి తెచ్చిన తర్వాత నేను రెండు సిలిండర్లు తీసుకున్నాను. ఇంత వరకు ప్రభుత్వ సబ్సిడీ రాలేదు. ప్రభుత్వ లేఖ కూడా నాకు అందలేదు. ప్రభుత్వం గ్యాస్ ఏజన్సీలకు సబ్సిడీ చెల్లించి, లబ్ధిదారులకు ఏజన్సీ వారు నేరుగా రూ.500లకే సిలిండర్ ఇచ్చేలా చూడాలి.

- ఎడ్ల చంద్రయ్య, టైలర్, మోత్కూరు

సబ్సిడీ అందని వారు టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలి : డీఎస్‌వో

మహాలక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి లేఖలు అందినప్పటికీ చాలా మందికి సబ్సిడీ జమ కావడం లేదని డీఎస్‌వో వనజ దృష్టికి తీసుకెళ్లగా రూ.500లకు గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇచ్చిన అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో మరోసారి చెక్ చేసుకోవాలని యాదాద్రిభువనగిరి జిల్లా డీఎస్‌వో వనజ తెలిపారు. లేఖ అంది సబ్సిడీ రాని వారు లేఖలో పేర్కొన్న టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సబ్సిడీ అందడం లేదని తమ కెలాంటి ఫిర్యాదులు అందలేదని ఆమె పేర్కొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం

చండూరు, సెప్టెంబరు 30: ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. చండూరు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రకాశించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో కొర్రీలు పెట్టవద్దని సూచించారు. నిత్యావసర ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో పేదలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధరల నియంత్రణలో పాలకులు స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. నల్పరాజు సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు అంజాచారి, రామలింగయ్య, బొల్గూరి నర్సింహ, రామచంద్రం, వెంకటేశ్వర్లు, బిక్షంరెడ్డి, చాపల శ్రీను, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

చిట్యాల, సెప్టెంబరు 30: ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం రైతు సంఘం నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు నర్సింహ డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల రైతులు తమ ధాన్యాన్ని, పత్తిని దళారులకు విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2850, పత్తికి క్వింటాల్‌కు రూ.12500 మద్దతు ధర ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లడె రాములు, రూపని ఇద్దయ్య, శిరసు హనుమయ్య, గుడిసె లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, సెప్టెంబరు 30: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొక్కవంతలపహాడ్‌లో శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్ష, శస్త్ర చికిత్స కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రోగులు, వైద్యబృందంతో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం 75 మందిని శస్త్రచికిత్స కోసం చెన్నైకు పంపించాలని నిర్వాహకులు తెలిపారు. బాధితులకు చెన్నై ప్రయాణ ఖర్చులు తానే భరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, నాయకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, మంజులశ్రీనివాస్, వెంకటరమణ, వెంకన్న, జానయ్య, కోఆర్డినేటర్ రాజు, డాక్టర్లు శంకర్, ఐశ్వర్య పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



నకిరేకల్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ ప్రజలు


నకిరేకల్, సెప్టెంబరు 30: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో లడ్డూ ఘటనపై భక్తులకు పంపిణీ చేయడాన్ని నిరసిస్తూ హిందూ ధార్మికసంస్థల ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి శాంతి ర్యాలీ నిర్వహించారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలని లడ్డూను కల్తీ చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, దుర్గామాత, శ్రీ వేకటేశ్వరస్వామి దేవాలయం, షిర్డీసాయి మందిరం, శివాలయం, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, గీతామందిరం చైర్మన్లు బ్రహ్మదేవర పద్మ, గుండా వెంకటయ్య, వనమా వెంకన్న, ఉప్పల రమేష్, కోటగిరి శ్రీనివాస్, పబ్బతి వెంకన్న, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు జొర్రిగల శ్రీనివాస్, గజ్జెల ప్రకాష్, సైదమ్మ, వసంత, లక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాములుయాదవ్


వేములపల్లి, సెప్టెంబరు 30: పీఏసీఎస్‌ను బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధిలో రైతులు భాగస్వాములు కావాలని పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించడంతో పాటు ఈ ఏడాది నూతనంగా పంట రుణాలు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ తమ సొసైటీ పరిధిలో రూ.2.16 కోట్ల వరకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో రవీందర్ రావు, వైస్ చైర్మన్ వల్లపుదాసు పద్మ, డైరెక్టర్లు బట్టు మాధవరెడ్డి, లక్ ప్రకాష్, మల్లింకటి పాపయ్య, మోదుగు ప్రభాకర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లేపల్లి తహసీల్దార్‌గా అన్వర్‌హుస్సేన్


అన్వర్ హుస్సేన్

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 30: కొండమల్లేపల్లి నూతన తహసీల్దార్‌గా అన్వర్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. శాలిగౌరారం మండలం నుంచి కొండమల్లేపల్లికి ఆయన తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన అనురాధ హైదరాబాద్ మెట్రో రైల్వేశాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అన్వర్‌హుస్సేన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ


వెంకటేశ్వర్లు


సాయి ప్రశాంత్

వేములపల్లి, తిప్పర్తి, మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 30: వేములపల్లి ఎస్‌ఐగా డి.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డి.విజయ్‌కుమార్ నల్లగొండ వీఆర్‌కు వెళ్లగా సూర్యాపేటలో విధులు నిర్వహిస్తున్న డి.వెంకటేశ్వర్లు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

● తిప్పర్తి ఎస్‌ఐగా బి. సాయిప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో విధులు నిర్వహించిన డి.రాజు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది నల్లగొండ ట్రాఫిక్ సీఐగా వెళ్లగా సూర్యాపేట జిల్లా సీసీఎస్ నుంచి వచ్చిన సాయి ప్రశాంత్ తిప్పర్తి ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు.

● మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐగా లోకేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్ విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన నరేష్‌పై పలు అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టిన పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు ఆయన్ను నల్లగొండ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఈ స్థానంలో లోకేష్‌కుమార్‌ను నియమించారు. అదేవిధంగా ఇదే స్టేషన్‌కు రెండో ఎస్‌ఐగా నల్లగొండ వన్‌టౌన్‌లో పనిచేస్తున్న సందీప్‌రెడ్డికి పోస్టింగ్ కల్పించగా విధుల్లో చేరాల్సి ఉంది.

ఆ భూమి ఎవరిది?


దేవస్థానం భూమి వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

▸ సందిగ్ధంలో 11.06 ఎకరాలు
▸ హరిత హోటల్ కోసం స్థల పరిశీలనతో సందేహాలు
▸ భూమి చెర్వుగట్టు ఆలయానిదా? లేక రెవెన్యూ శాఖదా?
▸ చెర్వుగట్టు మాస్టర్ ప్లాన్‌కూ సమస్య

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 30: నార్కట్‌పల్లి నుంచి నల్లగొండకు వెళ్లే దారిలో ఎల్లారెడ్డిగూడెం గ్రామశివారు (చెర్వుగట్టు రెవెన్యూ శివారులోకి వచ్చే) సర్వేనెంబర్ 280లో గల 11.06 ఎకరాల భూమికి యజమాని ఎవరనేది గందరగోళంగా మారింది. రాష్ట్ర పర్యాటక, టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్మించేందుకు ప్రతిపాదించిన హరిత హోటల్ కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు చేసిన క్షేత్రస్థాయి స్థల పరిశీలనతో ఈ ప్రశ్న ఉత్పన్నమైంది. అసలు ఈ భూమికి నిజమైన యజమాని చెర్వుగట్టు దేవస్థానమా? లేక రెవెన్యూ శాఖనా? అనే విషయంలో స్పష్టత లోపించింది. సదరు భూమిలో గ్రామ దేవత ఆలయాల నిర్మాణం చేపట్టి చెర్వుగట్టు దేవస్థానం అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారే తప్ప స్పందించని రెవెన్యూ అధికారులు ఇప్పుడు ఆ భూమి 2010లోనే రెవెన్యూశాఖకు అవార్డు చేయబడిందని చెప్పడం విస్మయం గొలుపుతుంది. ఈ భూమికి సంబంధించి ఆలనాపాలనాపై ఇటు ఎండోమెంట్, అటు రెవెన్యూ శాఖ అధికారుల వైఖరి దోబూచులాడుతున్నట్లుగా ఉంది.

రెవెన్యూ శాఖకు విక్రయం

వాస్తవానికి ఈ సర్వే నెంబర్‌లో ఉన్న 11.06 ఎకరాల భూమి ఒకప్పుడు చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందినదే. అయితే 1990లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బలహీన వర్గాల గృహ నిర్మాణం కోసం రెవెన్యూ శాఖ ద్వారా ఈ భూమిని దేవదాయ ధర్మాదాయశాఖ నుంచి కొనుగోలు చేసింది. ఇందుకు గాను రూ.6,95,760లను దేవస్థానం పేరిట చెల్లించింది. కొనుగోలుకు చెల్లించాల్సిన మొత్తంలో కేవలం 80శాతమే చెల్లించగా మిగతా 20శాతం ఇంకా చెల్లించాల్సి ఉంది. ఆ భూమిని ఇంటి స్థలాల కోసం ప్లాట్లుగా చేశారే తప్ప రాజకీయ వివాదాల కారణంగా లబ్ధిదారులకు స్వాధీనం చేయ లేదు.

20 సంవత్సరాలుగా లేఖలు

క్షేత్ర ప్రాశస్త్యంతో చెర్వుగట్టు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఏ యేటి కాయేడు పెరుగుతూ వస్తుంది. ఈ నేపథ్యంలో దేవస్థాన అభివృద్ధిలో భాగంగా భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు స్థలంతో పాటు గోశాల, వేదపాఠశాల, కాటేజీలు, దేవతా వృక్షాల వన పెంపకం కోసం స్థలం కొరత ఏర్పడింది. దీంతో సర్వే నెంబర్ 280లోని దేవస్థానానికి చెందిన రెవెన్యూ శాఖకు విక్రయించిన 11.06 ఎకరాల భూమిని తిరిగి దేవస్థానానికి స్వాధీనపరచాలని కోరుతూ ఈ ఆలయంలో 1999 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పనిచేస్తున్న ఈవోలు ఎండోమెంట్ కమిషనర్ ద్వారా కలెక్టర్, ఆర్‌డీవోలకు లేఖలు రాస్తూనే ఉన్నారు. కలెక్టర్లు, ఆర్‌డీవోలు మారుతున్నారే తప్ప భూమిని తిరిగి స్వాధీనం చేసే విషయం కొలిక్కి రాలేదు. పైగా దేవస్థానంలో ప్రతీ యేటా జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో ఈ సమస్యపై చర్చించడం తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. కాగా భూమి కొనుగోలు కింద రెవెన్యూ శాఖ 80 శాతం మేర దేవస్థానానికి చెల్లించిన మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయగా వడ్డీతో కలిపి రూ.30 లక్షలకుపైగా చేరిందని చెబుతున్నారు.

రెవెన్యూ శాఖ ఎందుకు స్పందించలేదు?

సర్వే నెంబర్ 280లోని స్థలంలో కొన్ని కుల సంఘాలు 2023లో గ్రామ దేవతల ఆలయాల నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో రెవెన్యూశాఖ పట్టించుకోలేదు. చెర్వుగట్టు దేవస్థానం అధికారులే ఈ భూమి పార్వతీ జడల రామలింగేశ్వరస్వామికి చెందినది ఎవరైనా అనుమతి లే కుండా ఆక్రమణలకు పాల్పడినా, నిర్మాణాలు గావించినా చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసింది. అప్పుడైనా తమ శాఖకు చెందిన భూమిని మీదన్నట్లు ప్రకటించుకుని బోర్డు ఎలా పెడతారని రెవెన్యూ అధికారులు ఎందుకు ప్రశ్నించలేదు.. స్పందించలేదనే ప్రశ్న భక్తుల నుంచి ఎదురవుతోంది.

2010లోనే అవార్డైంది



చెర్వుగట్టు రెవెన్యూ శివారు పరిధిలోకి వచ్చే సర్వేనెంబర్ 280లో గల 11.06ల విస్తీర్ణం గల భూమి చెర్వుగట్టు దేవస్థానం నుంచి రెవెన్యూ శాఖకు అవార్డు చేయబడినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కేవలం రెవెన్యూ శాఖకే ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకే హరిత హోటల్ కోసం ఆ స్థలాన్ని పర్యాటక శాఖ అధికారులకు చూపించాం.

\- వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్, నార్కట్‌పల్లి

చెల్లింపు ఎంత శాతమో స్పష్టత లేదు



దేవస్థానం భూమిని రెవెన్యూ శాఖకు విక్రయించిన సందర్భంగా చెల్లించిన మొత్తం అది ఎంత శాతమనేది స్పష్టత లేదు. 80శాతం చెల్లించారని తమ ఆలయంలో భూముల పర్యవేక్షణ చేసిన సిబ్బంది తెలిపారు. ఇంకా 20శాతం రావాల్సి ఉందన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లా. రికార్డులను పరిశీలించి చెబుతామన్నారు.

\- నవీన్‌కుమార్, ఈవో, చెర్వుగట్టు

మాస్టర్ ప్లాన్‌కు అవరోధం

చెర్వుగట్టు క్షేత్రాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి పరుస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఓ పర్యాయం చెర్వుగట్టు క్షేత్రానికి ఆహ్వానించి మాస్టర్ ప్లాన్ ద్వారా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. దేవస్థాన అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలంటే కావాల్సినంత భూమి అందుబాటులో లేదు. ఉన్న 11.06 ఎకరాల భూమి ప్రస్తుతం అటా....ఇటా... అన్నట్లుగా ఉన్న నేపథ్యంలో మాస్టర్ ప్లాన్‌కు అవరోధమేనని ఎండోమెంట్ అధికారులు తేల్చి చెప్పారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి


హాలియా : వైద్యశిబిరంలో పాల్గొన్న నాయకులు, సిబ్బంది

హాలియా, సెప్టెంబరు 30: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాలియా మునిసిపాలిటీ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ తాహి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు, కార్యాలయ సిబ్బందికి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయు విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రామకృష్ణ, సీహెచ్‌వో తావునాయక్, వైస్‌చైర్‌పర్సన్ సలహాదారుడు పిల్లి ఆంజనేయులు, కౌన్సిల్ సభ్యులు నల్లబోతు వెంకటయ్య, దేపావత్ ప్రసాద్‌నాయక్, తక్కలపల్లి సైదులు, మేనేజర్ రషీద్, సూపర్‌వైజర్ తబిత, హెల్త్ అసిస్టెంట్ సైదులు, జావిద్, ఏఎన్‌ఎం శ్రీలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో .... హాలియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వి.యాదయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సీహెచ్ రాజు, డాక్టర్ కాంతయ్య, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికుల ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వారికి మందులు అందించారు. మండలవ్యాప్తంగా 25మంది పారిశుధ్య కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి అర్చన కొండ్ర, ఎంపీవో నాగలక్ష్మి, ఏఈ మమత, ఏపీఎం యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలి : బీఎల్ఆర్



విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 30: పండగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన బతకమ్మ ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఆదిత్య ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, మహిళలతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన, ఆసక్తి కల్పించాలన్నారు. ప్రతీ పండగకు ఒక ప్రత్యేకత ఉంటుందని, మహిళలు, చిన్నారులకు మహానందం కలిగించే పండగ బతుకమ్మ న్నారు. ప్లాస్టిక్‌రహితంగా పండగలు నిర్వహించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కాగా అభ్యాస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు రంగురంగుల పూలతో అందమైన బతకమ్మలను పేర్చి అబ్బురపరిచారు. కార్యక్రమాల్లో ఎంఈవో బాలునాయక్, కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ జయలక్ష్మీజలందర్, ట్రస్మా నేత రవీందర్‌రెడ్డి, బాలు, నాగరాజు, అనిత పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

పెద్దవూర, సెప్టెంబరు 30: నకిలీ పత్తి విత్తనాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ డిమాండ్ చేశారు. మండలంలోని కుంకుడు చెట్టుతండాలో నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతుల పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేవని అన్నారు. నకిలీ పత్తి విత్తనాలను అమ్మిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వారి ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు పిడిగం నాగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, నాయకులు రాజేష్‌నాయక్, సురభి రాంబాబు, రామలింగయ్య, శ్రీను పాల్గొన్నారు.

రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలి



బీజేపీ సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్

దేవరకొండ, సెప్టెంబరు 30: బీజేపీ సభ్యత్వాల నమోదు రికార్డు స్థాయిలో చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నల్లగొండ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ తూల వీరేందర్‌గౌడ్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. భారతదేశాన్ని అభివృద్ధిలో మొదటిస్థానంలో తీసుకువచ్చేందుకు ఆయన కృషి చేస్తున్నారని కొనియాడారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బూత్‌ల వారీగా నూతన సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్, నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, నాయకులు వనం నరేందర్‌రెడ్డి, నేతాళ్ల వెంకటేష్, పోతం కర్నాకర్, సైదులు, గుండాల అంజయ్యయాదవ్, భాస్కర్, సాంబశివగౌడ్ పాల్గొన్నారు.

ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ కోఆర్డినేటర్‌గా ఉమ

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 30: ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ నార్కట్‌పల్లి మండల కోఆర్డినేటర్‌గా మండలంలోని నక్కలపల్లి జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు మారోజు ఉమ నియమితులయ్యారు. ఇటీవల మునుగోడులో జరిగిన ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం కాంప్లెక్స్ సమావేశంలో మండల కోఆర్డినేటర్‌గా ఉమను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మారోజు ఉమ మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ టీచర్లకు తగు సలహాలు సూచనలు చేయనున్నట్లు తెలిపారు. ఉమ ఎన్నికపై విశ్వకర్మ తేజస్విని సాహితీ సంస్థ అధ్యక్షుడు పెండోట సోమయ్య, రామకృష్ణ, బ్రహ్మచారి, రమేష్, శ్రీనివాసచారి, సత్యనారాయణచారి హర్షం వ్యక్తం చేశారు.

బంగారు పతకాలు సాధించడం అభినందనీయం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

నిడమనూరు, సెప్టెంబరు 30: జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడం అభినందనీయమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నిడమనూరు ఎంఈవో వెంకన్ననాయక్ అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కరాటేలో శిక్షణ అందించి జాతీయస్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దిన నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన ఉత్తమ కరాటే మాస్టర్ పోతుగంటి శ్రీనివాస్‌ను వారు అభినందించారు. మిర్యాలగూడలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం సుమన్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 22వ జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు కరాటేలో శిక్షణ అందించి జాతీయస్థాయిలో గోల్డ్ పతకాలు సాధించారు. దీంతో శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ఎంతోమంది విద్యార్థులకు కరాటే శిక్షణ ద్వారా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు.

టైలరింగ్ వర్కర్ల సమ్మె విరమణ

హాలియా, సెప్టెంబర్ 30: టైలరింగ్ వర్కర్లు సమ్మె విరమించారు. హాలియాలో పీస్ వర్క్ రేట్లు పెంచాలని కోరుతూ నాలుగు రోజులుగా టైలరింగ్ వర్కర్స్ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో వర్కర్స్ యూనియన్ నాయకులు సమ్మె చేపట్టారు. సోమవారం వర్కర్ల డిమాండ్లను హాలియా టైలరింగ్ ఓనర్స్ అసోసియేషన్ అంగీకరించడంతో సమ్మెను విరమించారు. కార్యక్రమంలో హాలియా టైలరింగ్ ఓనర్స్ అధ్యక్షుడు ఐటిపాముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మిషిని యాదగిరి, కోశాధికారి ఏ.రాము, గౌరవాధ్యక్షుడు గడ్డం రమణయ్య, నాయకులు ఆదిమూలం ఆంజనేయులు, కొంగరి రవి, కృష్ణ, చైతన్యనాయక్, శ్రీను, హరిబాబు, వెంకన్న, ఏడుకొండలు, సతీష్, శ్యాం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

హాలియా: అనుముల ఎంఈవోగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై మిర్యాలగూడకు వెళ్లిన లావూరి బాలునాయక్‌ను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) మండల శాఖ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రశిక్షణ కోకన్వీనర్ గుర్రం ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేణికుంట్ల రాజశేఖర్, గుర్రం సత్యనారాయణరెడ్డి, మండల బాధ్యులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఎస్‌ఐ రాంమూర్తి అన్నారు. కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సేవా సంస్థలు ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు, గోపి, డాక్టర్ శ్రీనివాస్, శ్రీశైలం, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఎన్నికల హామీల మేరకు ప్రభుత్వం రైతులకు రూ.2లక్షలు మాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుకుంట్ల రాములు డిమాండ్ చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని చెప్పి కొంత మందికి మాత్రమే రుణమాఫీ చేయడం సరికాదన్నారు. రుణమాఫీ చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

చింతపల్లి: మండలంలోని శివాలయం వద్ద విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు విద్యుత్ శాఖ ఏఈ, ఎంపీడీవోకి వినతిపత్రం సమర్పించారు. శివాలయం సమీపంలో విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కొమరిశెట్టి వెంకటయ్య, శేఖర్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లగొండరూరల్: నల్లగొండ పట్టణంలోని ఐలమ్మ రజక మటన్ షాపుల నూతన కమిటీని ఎన్నకున్నారు. నూతన అధ్యక్షుడిగా కట్లకుంట్ల శంకర్, ప్రధాన కార్యదర్శి వట్టికోటి శంకర్, కోశాధికారి కునుకుంట్ల వెంకన్న, ఉపాధ్యక్షులు కట్టకుంట్ల పరమేష్, సహాయ కార్యదర్శి వట్టికోటి నర్సింహ, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నలుపరాజు సైదులు మటన్ షాపులకు స్థలాలు ఏర్పాటు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.

మాడ్గులపల్లి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మండలంలోని కల్వపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవానికి ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేసి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగయ్య, స్కూల్ టీచర్ సరిత, అంగన్‌వాడీలు, పాల్గొన్నారు.

కనగల్: నల్లగొండ పట్టణంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సయిదుద్దీన్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి అనుమలరవీందర్‌బాబు, ఉపాధ్యక్షుల అశోక్, పుష్పలత, కోశాధికారి పరిపూర్ణ, కార్యదర్శులు, సభ్యులను ఎన్నికున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, నర్ర శేఖర్‌రెడ్డి, గౌరి నర్సింహ, వీరనర్సింహ, రఫేల్, పగిళ్ల సైదులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: రాష్ట్రస్థాయి అక్షర ప్రతిభ పురస్కారాలకు శాలిగౌరారం మండలం అడ్లూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుల నగేష్ ఎంపికయ్యారు. అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో అక్షర ప్రతిభ పురస్కారాలకు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ప్రస్తుతం నగేష్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల(చెర్వుగట్టు)లో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

'దసరా ఆఫర్లు నిర్వహిస్తే చర్యలు'

శాలిగౌరారం, కొండమల్లేపల్లి, మర్రిగూడ, హాలియా, సెప్టెంబరు 30: దసరా ఆఫర్లు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కొండమల్లేపల్లి, మర్రిగూడ, హాలియా ఎస్‌ఐలు రామ్మూర్తి, రంగారెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. అక్రమ పద్ధతిలో నగదు సంపాదించాలనే దురాలోచనతో దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను ఆసరా చేసుకొని ప్రజల నుంచి నగదు దండుకునే విధంగా లాటరీలు, జూదం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తే సదరు వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దసరా పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి రూ. 200 కొట్టు మేకను పట్టు అనే ఆఫర్ పెడతున్నారని, ఇలాంటి ఆఫర్లు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి ఆఫర్లు నిలిపివేయాలని హెచ్చరించారు. ఆఫర్లు కొనసాగించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీఎస్సీ ఫలితాల్లో అభ్యర్థుల ప్రతిభ


పానుగంటి రాఘవేంద్ర

నార్కట్‌పల్లి, నల్లగొండ టౌన్, నార్కట్‌పల్లి, హాలియా, దామరచర్ల, సెప్టెంబరు 30: ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన మెగా డీఎస్సీ-2024 ఫలితాల్లో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు పానుగంటి రాఘవేంద్ర జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు.


వలిశెట్టి యాదగిరి

● శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి వలిశెట్టి యాదగిరి 79.07 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ఐదవ ర్యాంకు సాధించారు. యాదగిరి కల్వకుర్తిలో కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్‌గా, సంస్థాన్‌నారాయణపురంలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్‌గా పనిచేశారు.


మాంద్ర శివప్రసాద్

● నార్కట్‌పల్లి మండలం మాంద్రకు చెందిన యువకుడు మాంద్ర శివప్రసాద్ ఎస్జీటీగా ఉపాధ్యాయ పోస్టును సాధించాడు. 80.6 మార్కులతో జిల్లాలో 8వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ఉస్మానియాలో పీజీ చేస్తూ ఎస్జీటీ పోస్టుకు కష్టపడి చదవి రెండవ పర్యాయం ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టు సాధించాడు.


మేకల ప్రశాంతి

● హాలియాకు చెందిన మేకల ప్రశాంతి రాజశేఖర్‌యాదవ్ ఎస్జీటీ పోస్ట్‌లో 6వ ర్యాంకు సాధించింది. ఆమె ర్యాంకు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

● అడవిదేవులపల్లి మండలం బంగారుకుంటతండాకు చెందిన కుర్ర శ్రీను ఎస్జీటీ విభాగంలో 456వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ కొలువు సాధించాడు.